క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

కూకట్‌పల్లి: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్యుడు టి.రఘునాథ్ స్వామి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కూకట్‌పల్లి జోన్ డాక్టర్ రాంకుమార్ పాల్గొన్నారు. జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీలో పాల్గొని.. అనంతరం జరిగిన సమావేశంలో అతిథులు మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 3500 మరణాలు సంభవిస్తున్నాయని, రోగ నిర్ధారణ చేయకుంటే ఏడాదికి 10 నుంచి 15 మందికి క్షయ సోకే ప్రమాదం ఉందన్నారు. క్షయ వ్యాధిని ఎదుర్కోడానికి జిల్లా యంత్రాంగం సమర్థంగా చర్యలు తీసుకుంటుందన్నారు. 1 నుంచి 2 వారాల పాటు నిరంతరంగా దగ్గు ఉన్న వ్యక్తులు ఉచిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలనలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల పాత్ర కీలకమైందని చెప్పారు. అనంతరం టీబీ రోగులకు పౌష్టికాహార కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నారాయణరావు, సంధ్యారాణి, సరస్వతి, పద్మావతి, మునుపప్పన్, మమత, తీతసి, సౌమ్య మోహన్, శ్రవణ్, మధురవాణి, శశి, రామకృష్ణ, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను కలిసిన రినీష్‌రెడ్డి



కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి తనయుడు రినీష్ రెడ్డి కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేశ్‌ను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును శనివారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో సునీత విజయం కార్యకర్తల సమష్టి బాధ్యతన్నారు.

‘ప్రతిపక్ష నాయకుల అరెస్టులు ఆపాలి’



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ, సీపీఎం నాయకులు

బాలానగర్: ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులను తక్షణమే ఆపాలని సీపీఎం, సీపీఐ కూకట్‌పల్లి మండల వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా శ్రీశ్రీనగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి ఎం.శంకర్, మండల నాయకుడు కె.కృష్ణ నాయక్, సీనియర్ నాయకుడు చెన్న కేశవులు, సీపీఐ మండల కార్యదర్శి కె.కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రతిపక్ష పార్టీలపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసిందన్నారు. ప్రతిపక్ష పార్టీల బ్యాంక్ అకౌంట్లు సీజ్ చేస్తూ.. ఎన్నికల్లో దెబ్బ తీసేందుకు మోదీ ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని తెలిపారు. ఎన్నికల ఎలక్టోరల్ బాండ్లను ఉపయోగించుకొని రూ.6,500 కోట్ల విరాళాలు బీజేపీ పొందిన విషయం.. సుప్రీం కోర్టులో సీపీఎం పిటిషన్ వేయడం ద్వారా బయటపడిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బి.శ్రీను, ఎండీ తాజుద్దీన్, సీపీఐ నాయకులు అంజి, రమేశ్, ఉపేంద్ర, వసంత, అనిత ప్రసాద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కిందికుంట పార్కులో వసతులు కల్పిస్తాం



వాకర్స్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో వాకర్స్ సమస్యలపై కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ఆరా తీశారు. పార్కులో వాకింగ్ చేసే వారికి ఇబ్బందులు తలెత్తకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా సందర్శకుల కోసం ప్రహరీలపై వినూత్న చిత్రాలు వేయించడంతో పాటు చుట్టూ మొక్కలు, బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ తెలిపారు.

రంగులద్దుకున్న ‘పంచశీల’



మూసాపేట: పంచశీల స్కూల్‌లో శనివారం హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హోలీ విశిష్టత, రంగుల గురించి ఉపాధ్యాయులు వివరించారు.



పంచశీల స్కూలులో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బాలానగర్: భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా బాలానగర్ మండలం శ్రీశ్రీనగర్ సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి జి.కృష్ణ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా నాయకులు ఎం.చంద్రమ్మ, జి.ఉమారాణి, శైజాద్‌బేగం, బీబీ, మల్లికాబేగం, అంబిక, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వెంకట్రామ్‌నగర్ కాలనీలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ఎస్.భూపతిరావు, వైస్ ప్రెసిడెంట్ కె.అశోక్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ కె.దశరథ్ రెడ్డి, సలహాదారులు కె.రవీందర్‌రెడ్డి, ఎస్.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ప్రధాని పాలన చూసి బీజేపీకి ఓటేయండి

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

మోతీనగర్: అల్లాపూర్‌లో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌కు మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పదేళ్ల పరిపాలన చూసి బీజేపీకి ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 12 కోట్ల టాయిలెట్స్ కట్టించి మహిళల ఆత్మ గౌరవం కాపాడారని గుర్తుచేశారు. డిజిటల్ ట్రాన్సాక్షన్ విధానం అమెరికాలో పదేళ్లు పడితే మన దేశంలో మూడేళ్లకే సాధ్యమైందన్నారు. 500 సంవత్సరాలుగా కలగా ఉన్న రామమందిరాన్ని నిర్మించి భారత ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని ఈటల పేర్కొన్నారు. తెలంగాణలో 12 సీట్లలో బీజేపీ గెలవాలని.. అందులో మల్కాజ్‌గిరి కూడా ఉండాలని ఆకాంక్షించారు.

ఈటలకు కార్యకర్తలు అండగా ఉండాలి..

అల్లాపూర్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరావుతో కలిసి ఈటల రాజేందర్ శనివారం పర్యటించారు. ముందుగా భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్‌లోని బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాస్, మరో 50 మంది కార్యకర్తలు మేడ్చల్ జిల్లా బీజేపీ సెక్రటరి పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈటెల, వడ్డేపల్లి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి మాట్లాడుతూ.. ఈటల రాజేందర్ తెలంగాణ కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఈటలకు ప్రతి కార్యకర్త అండగా ఉంటూ ఆయన విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ పులిగోళ్ల శ్రీలక్ష్మి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మోదీ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ 5వ ఫేజ్‌లోని పార్కులో శనివారం మోదీ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కూకట్‌పల్లి జనసేన నాయకుడు ప్రేమకుమార్ రాజేందర్‌తో కలిసి ఈటల కొద్దిసేపు పార్కులో వాకర్స్‌తో మాట్లాడారు. అనంతరం జనసేన, బీజేపీ నాయకులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అడుగు జాడల్లో నేటి యువత నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, జిల్లా సెక్రెటరీ ప్రీతమ్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కూరగాయల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో ప్రతి ఆదివారం వారంతపు కూరగాయల సంత కొనసాగుతోంది. అదేవిధంగా అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తా సెంటర్, ఆర్‌కే సొసైటీ, అల్లాపూర్‌లో కూడా వారాంతపు సంత జరుగుతోంది.

శుభాకాంక్షలు



ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరగారి ప్రీతంను శనివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకుడు చిరుమర్తి రాజు కలిసి శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సునీత మహేందర్‌రెడ్డికి సన్మానం



మోతీనగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు గణేశ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొన్నాల రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం సునీత మహేందర్‌రెడ్డిని పూలమాలతో సన్మానించి మాట్లాడారు.

‘రజాకార్’ నటుల సందడి



సినిమాను వీక్షించిన డైరెక్టర్ సత్యనారాయణ, నటి ఇంద్రజ తదితరులు

మూసాపేట: మూసాపేటలో రజాకార్ సినిమా బృందం శనివారం సందడి చేసింది. చిత్ర డైరెక్టర్ యాటా సత్యనారాయణ, నటి ఇంద్రజ లక్ష్మీకళ థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య సినిమా వీక్షించారు. వారివెంట కార్పొరేటర్ మహేందర్, థియేటర్ మేనేజర్ ప్రవీణ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల హల్‌చల్



ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని సాయినగర్‌లో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి.. తిరిగి ఈ ప్రాంతంలోనే వదిలి వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని పీజేఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్ ఏర్పాటు చేసిన సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళా సాధికారిత కోసం పొదుపు సంఘాలకు నిధులు విడుదల చేయటం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యం, బాషిపాక నాగమణి యాదగిరి, ముకయ్య, వెంకటస్వామి సాగర్, ఆల్వాల భాస్కర్, లక్ష్మి, మల్లేశ్, మంజు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో వరల్డ్ వాటర్ డే సదస్సు



సదస్సులో పాల్గొన్న హిమబంధు, ప్రసన్నకుమార్ తదితరులు

బాలానగర్: యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలోని ఎన్విరాన్‌మెంట్ డిపార్టుమెంట్‌లో శనివారం వరల్డ్ వాటర్ డే సదస్సు జరిగింది. హెచ్‌ఓడీ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్, ఆచార్య సుధీర్ కుమార్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ అండ్ అడ్వర్సీ డిపార్టుమెంట్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హిమబింధు మాట్లాడుతూ.. అనేక ప్రాంతాల్లో తాగునీరు నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. మంచినీటిని జాగ్రత్తగా వాడుకోని పక్షంలో భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. నీటి ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. నీటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు


ఓల్డ్ బోయిన్‌పల్లి: చిరుధాన్యాలపై అవగాహన సదస్సులో భాగంగా ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు పండ్లు, ఫలహారాలు అందించారు. అనంతరం సత్యమ్మ మాట్లాడుతూ.. పోషణ పక్షంలో భాగంగా హస్మత్‌పేట సెక్టర్‌లోని అన్ని కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, ధనలక్ష్మి, ఆయా స్వప్న, డాక్టర్ దీప్తి, ఏఎన్‌ఎం స్వరూప, ఆశా వర్కర్లతో పాటు గర్భిణులు హేమలత, బసవమ్మ, స్రవంతి, రుక్సానా తదితరులున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు చేస్తున్న సిబ్బంది

ఆస్తిపన్ను వసూళ్లపై జోనల్ కమిషనర్ సమీక్ష

కూకట్‌పల్లి: ఆస్తిపన్ను వసూళ్లు, రక్షణ, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ సర్వేలపై శనివారం జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అధికారులతో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్తి పన్ను వసూళ్లను సమీక్షించడంతో పాటు ఎగవేతదారులపై దృష్టి సారించాలన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు 30వ తేదీ లోపు మొత్తం బకాయిలు చెల్లిస్తే 90 శాతం పెనాల్టీని తగ్గించాలని సూచించారు. చెల్లింపుల కోసం ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ఫీల్డ్‌కు హాజరు కావాలని ఆస్తిపన్ను అధికారులను ఆదేశించారు. అదే విధంగా కూకట్‌పల్లి పరిధిలోని సరస్సుల రక్షణ గురించి చర్చించారు. సరస్సుల ఇన్‌ఛార్జి అధికారులుతో సరస్సు రక్షణ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్‌టీఎల్, సరస్సుల బఫర్ జోన్‌ల ఆక్రమణలను అరికట్టేందుకు జీహెచ్‌ఎంసీ ఇన్‌చార్జి అధికారులు, స్థానికులు, ఆర్‌డబ్ల్యూఎస్ సభ్యులతో ఇప్పటికే లేక్ వైజ్ వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డిప్యూటీ కమిషనర్లు ఆయా గ్రూపులను పర్యవేక్షించి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారని చెప్పారు. హెచ్‌ఎండబ్ల్యూయస్ అండ్ ఎస్‌బీ సిబ్బందితో వర్షపు నీటి నిల్వ నిర్మాణాల సర్వే కోసం కూకట్‌పల్లిలో 23 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎస్‌ఈ చిన్నారెడ్డి,సీపీ ఎంఎస్ ఉమాదేవి, సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య, డీసీ, ఎంపీ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష, సమావేశంలో పాల్గొన్న అభిలాష అభినవ్ తదితరులు

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శనివారం పీఓ ఇంద్రసేన ఆధ్వర్యంలో ఆర్‌పీలకు ఎస్‌ఎల్‌ఎఫ్, టీఎల్‌ఎఫ్ లీడర్లకు ఓటుహక్కు నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. సమావేశంలో 18 సంవత్సరాలు పైబడిన వారంతా బీఎల్‌ఓలు దగ్గర లేదా ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమానికి డీపీఎం లలితా దేవి, ఏపీఎం మునిస్వామి హాజరయ్యారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొఫెసర్ కోదండరాం



ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: మూడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదని బస్తీ దవాఖానలో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం జేఏసీ చైర్మన్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు బస్తీ దవాఖాన ఉద్యోగులు అమ్జద్ అలీఖాన్, మెతుకు ఉప్పలయ్య వినతిపత్రం ఇచ్చారు. వేతనాలతో పాటు 2019 కాంట్రాక్ట్ విధానంలో నియామకమైన సపోర్టింగ్ స్టాఫ్‌కు వారి ఖాతాల్లో ప్రావిడెంట్ ఫండ్ జమ కావడం లేదని కోదండరాం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వేతనాలు పెరగలేదని, 2021 జూన్‌లో పెరిగిన వేతనాలు రావాల్సి ఉందన్నారు. దీనికి స్పందించిన కోదండరాం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

‘ఎస్కీ’లో ముగిసిన శిక్షణ

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. మూడు రోజుల పాటు పాండేచ్చేరి యూనివర్శిటీకి చెందిన 83 మంది విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా స్కిల్ శిక్షణతోపాటు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా ఎనలైటిక్స్ వంటి అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించాలంటే, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన చేయాలంటే బ్లాక్ చెయిన్ టెక్నాలజీ తదితర అంశాలపై అవగాహన అవసరమన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ఇచ్చారు.

అవుట్ డోర్ రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ

గచ్చిబౌలి: ఒలింపిక్‌లో రాక్ క్లైంబింగ్‌కు అవకాశం ఉండటంతో అవుట్ డోర్ రాక్ క్లైంబింగ్‌లో నైపుణ్యం పెంపొందించాలని ట్రాగ్ స్పోర్ట్ క్లైంబింగ్ స్టూడియో నిర్వాహకులు రంగారావు తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాక్ క్లైంబర్స్‌కు ఓపెన్ మైక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న సహజ వనరులను వినియోగించుకొని రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. దక్కన్ పీఠభూమి రాక్స్‌తో నిండి ఉందని, వాటిని ఉపయోగించుకొని రాక్ క్లైంబింగ్ ఒలింపిక్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేస్తున్న సంస్థలకు ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. హైదరాబాద్ క్లైంబర్స్, ఖాజాగూడ, కొండమడుగు, పాండవుల గుట్ట తదితర ప్రాంతాలలో అవుట్ డోర్ రాక్ క్లైంబింగ్ చేస్తున్నారని చెప్పారు. భువనగిరిలో రాక్ క్లైంబింగ్ స్కూల్, అవుట్ డోర్ ప్రాజెక్ట్, సొసైటీ టూ సేవ్‌రాక్ సంస్థలు రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు.

టెట్ ఫీజు తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య శనివారం డిమాండ్ చేశారు. గతంలో ఒక్క పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఉండగా పెంచిన ఫీజు ఒక్క పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 పెంచడం దారుణమన్నారు. నిరుద్యోగంతో బాధపడుతున్న విద్యార్థులకు ఫీజుల భారం మోపడం సరి కాదని ఫీజులు తగ్గించకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

పీహెచ్‌డీ ఫీజుల తగ్గింపునకు ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. శనివారం వీసీ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద పీహెచ్‌డీ విద్యార్థులు బైఠాయించి ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా పీహెచ్‌డీ విద్యార్థి, ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ.. పెంచిన ఫీజులు తగ్గించాలని గత ఆరు నెలలుగా పోరాడుతున్న పట్టించుకోని వీసీ ప్రొ.రవీందర్ ఈ నెల 30వరకు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపించడం దారుణమన్నారు. సంపాదించే వయస్సుల్లో పీహెచ్‌డీ చదవడమే ఆర్థిక భారమని గతంలో లభించే స్కాలర్‌షిప్‌లను రద్దు చేయడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఫీజులను తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నెల 26న అన్ని విద్యార్థి సంఘాల మద్దతుతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేశారు.

ముగిసిన సింపోజియాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులు జరిగిన జాతీయ సింపోజియాలు శనివారం ముగిశాయి. ఆయా విభాగాలలో ఇంజినీరింగ్ విద్యార్థులు స్వయంగా నిధులు సేకరించి సదస్సులు, వివిధ రకాల ఎగ్జిబిషన్స్ నిర్వహించారు.

చెరువును పరిరక్షిస్తాం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు తమ జాగీరుగా మార్చుకుని ప్రభుత్వ భూమి అక్రమణలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లోని సర్వే నెంబరు 324లో జరుగుతున్న చెరువు భూకబ్జాను పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు చెరువు సైతం వదలడం లేదని, ఈ విషయమై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చెరువును పరిరక్షిస్తామని పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132